క్లుప్తంగా

స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ప్రారంభం



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న శిక్షకులు

వి.కోట: స్థానిక విద్యానికేతన్ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై సోమవారం శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండలంలో డిగ్రీ పూర్తి చేసిన, ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు తమ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఆ కాలేజీ కరస్పాండెంట్ దామోదర్‌రెడ్డి తెలిపారు. దాదాపు 30 కంపెనీల ప్రతినిధులు ఆయా సంస్థలకు అవసరమైన ఉద్యోగాలకు అర్హులైన వారిని ఎంపిక చేసుకుంటాయని, ఈ దిశగా ఉద్యోగాలు పొందడానికి బెంగళూరుకు చెందిన జై గ్లోబల్ టెక్ సౌజన్యంతో స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇస్తున్నామని, మండలంలో డిగ్రీ పూర్తి చేసిన, ఫైనల్ ఇయర్ చదువుతున్న ఏ కళాశాల విద్యార్థులైనా హాజరై ఉచిత శిక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, శిక్షకులు పాల్గొన్నారు.

వైద్యశాలకు మొక్కలు



మొక్కలు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

సదుం: స్థానిక సీహెచ్‌సీ వైద్యశాలకు లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం మొక్కలను అందజేశారని వైద్యాధికారి డాక్టర్ పుష్పలత తెలిపారు. వివిధ రకాల మొక్కలు 140 మొక్కలను ఆసుపత్రి ఆవరణలో నాటనున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని, దీనిలో భాగంగానే మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని లయన్స్‌క్లబ్ డీసీ జయకుమార్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు నరసింహులు, నాగరాజు, ఆంజనేయులు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రికార్డులు లేకపోతే వాహనాలు సీజ్



పుంగనూరులో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ సుప్రియ

పుంగనూరు: రహదారిపై తిరిగే వాహనాలకు సరైన రికార్డులు లేకపోయినా, ఓవర్‌లోడుతో ప్రయాణిస్తున్నా వాటిని సీజ్ చేసి, జరిమానా విధిస్తామని ఎంవీఐ సుప్రియ హెచ్చరించారు. సోమవారం ఆమె పట్టణ పొలిమేర్లలో వాహనాల తనిఖీ చేశారు. ఇన్సూరెన్స్, పొల్యూషన్, ఎఫ్‌సీతో పాటు డ్రైవింగ్ లైసెన్సులు లేని పలు వాహనాలకు జరిమానా విధించి పైవిధంగా వార్నింగ్ ఇచ్చారు. రహదారి భద్రత నియమావళి మేరకు ప్రతి ఒక్కరూ నడచుకోవాలని హితవు పలికారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరు సహకరించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు.

జెడ్పీ హైస్కూల్‌కు ఫర్నీచర్ విరాళం



జోస్ ఆలుకాస్ అందజేసిన ఫర్నీచర్

పుంగనూరు: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌కు జోస్ ఆలుకాస్ సంస్థ రూ.1.18 లక్షల విలువచేసే ఫర్నీచర్ విరాళంగా అందజేసింది. సోమవారం సంస్థ మేనేజర్ అలెక్స్ , అకౌంటెంట్ జైను, పీఆర్‌ఓ రంజిత్, మేనేజర్ విశ్వనాథ్ తదితరులు హెచ్ఎం రుద్రాణికి ఫర్నీచర్ అందజేశారు. సంస్థ 60ఏళ్ల వార్షికోత్సవం పురస్కరించుకుని ఈ వితరణ చేసినట్టు చెప్పారు. హెచ్ఎం వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీవీ.రమణ, అపర్ణ, గీతాంజలి, ముత్యాలు, సుగుణ, త్రివేణి, శ్రీదేవి పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



బైరెడ్డిపల్లె: నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని మండలంలోని దాసార్లపల్లెలో సోమవారం జైభీమ్ ఫౌండేషన్ చైర్మన్ శంకర్ అంబేద్కర్ ముఖచిత్రంతో ఉన్న క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, డాక్టర్ అంబేద్కర్ అడుగుజాడల్లో ఎంతో మంది ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. అనంతరం దాసార్లపల్లెలో ఇంటింటికీ క్యాలెండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.


డెత్ సర్టిఫికెట్‌కు చావు కష్టాలే..!

ఆత్మహత్యా యత్నం చేసిన వారిని, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారి ప్రాణాలను కాపాడుకునేందుకు కుటుంబ సభ్యులు పడే వేదన వర్ణనాతీతం. ఒక ఆస్పత్రి నుంచి మరో ఆస్పత్రి రెఫర్లతో ఉరుకులు పరుగులు..అక్కడ చికిత్సలో జాప్యం..వెరసి అప్పటికే మరణించినట్లు తేలితే ఒక్కసారిగా సముద్రమంత దుఃఖం ఎగదన్నుకొస్తుంది. ఇంతవరకే ప్రాప్తం అని గుండె దిటవు చేసుకుని అంత్యక్రియలు నిర్వహించి, ఆ తర్వాత డెత్ సర్టిఫికెట్ కోసం వెళితే..!? మళ్లీ అదో పెద్ద చావు కష్టాలు తెచ్చి పెడుతున్నాయి. ఇది ఒకరి వ్యథ మాత్రమే కాదు.. ఇలాంటి దురదృష్టకర అనుభవాలు ఎందరికో మరింత విషాదాన్ని మిగుల్చుతున్నాయి.



- బ్రాడ్ డెత్ కేసుల్లో తప్పని తిప్పలు
- నిబంధనలు తెలియని అధికారులతో మరింత అవస్థలు
- పొంతన లేని ఎఫ్ఐఆర్‌లతో మరిన్ని కొత్త కష్టాలు
- ధ్రువపత్రం కోసం వారాల తరబడి ప్రదక్షిణలు
- ఇదీ మార్గమధ్యంలో చనిపోయే వారి కుటుంబీకుల బాధలు

పోలీసుల తప్పుడు సమాచారంతో మరిన్ని ఇబ్బందులు



రాజారెడ్డిని రుయాకు తీసుకెళ్లగానే మరణించినట్లు గంగవరం పోలీస్ నిర్ధారించి ఆ విషయాన్ని గంగవరం సీఐకు వాట్సాప్‌లో సమాచారం ఇచ్చారు. అయితే, ఆ స్టేషన్ రైటర్ ఎఫ్ఐఆర్‌లో రాజారెడ్డి రుయాలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు నమోదు చేయడంతో డెత్ సర్టిఫికెట్ రాకుండా పోయేందుకు పెద్ద కారణమైంది. ఎట్టకేలకు చేసిన తప్పును తెలుసుకున్న పోలీసులు ఆ గంగవరం తహసీల్దార్ ద్వారా ఆదేశాలిచ్చి సంబంధిత సచివాలయం ద్వారా మరణ ధ్రువపత్రాన్ని ఇవ్వాలని తాజాగా ఆదేశాలిచ్చారు.


పలమనేరు: నియోజకవర్గంలోని గంగవరం మండలం జీడిమాకులపల్లెకు చెందిన రాజారెడ్డి(46) అనారోగ్య సమస్యతో గత ఏడాది నవంబర్ 5న సాయంత్రం పురుగుల మందుతాగి ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన అతని భార్య స్థానికులతో కలసి ఆయన్ను పలమనేరు ఆస్పత్రికి తరలించారు. సమాచారమివ్వడంతో గంగవరం పోలీసులు అక్కడికి పోలీసులు చేరుకున్నాక ప్రథమ చికిత్స చేసిన వైద్యులు ఆయన పరిస్థితి విషమంగా ఉందని చిత్తూరు ఆస్పత్రికి రెఫర్ చేశారు. దీంతో ఉరుకులు పరుగులతో రాజారెడ్డిని చిత్తూరుకు తీసుకెళితే..ఇక్కడ కాదని తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. అప్పటికే సమయం అర్ధరాత్రి దాటింది. దీంతో వారు అక్కడ ఓ ప్రైవేటు అంబులెన్స్ మాట్లాడి రుయా ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ సెక్యూరిటీ సిబ్బంది ప్రశ్నలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇవన్నీ చేసేలోపే రాజారెడ్డి మృతి చెందాడు. ఇది తెలియని కుటుంబీకులు అతన్ని రుయాలోకి తీసుకెళ్లగా అప్పటికే అతను మార్గమధ్యంలో మరణించినట్లు (బ్రాడ్ డెత్)గా వైద్యులు నిర్ధారించారు. అక్కడికొచ్చిన గంగవరం పోలీస్ ద్వారా సీఐకి సైతం సమాచారం ఇచ్చారు. ఆపై మృతదేహానికి పోస్టుమార్టం చేసి సర్టిఫికెట్‌ను ఇచ్చారు. దీంతో మరుసటి రోజు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

ఆపై డెత్ సర్టిఫికెట్ కోసం పాట్లు

పలమనేరు ఏరియా ఆస్పత్రికి వెళ్లి డెత్ సర్టిఫికెట్ అడిగితే రాజారెడ్డిని తీసుకువచ్చినప్పుడు ఇక్కడ బతికే ఉండడంతో తమకు సంబంధం లేదని అక్కడి డాక్టర్లు చెప్పారు. దీంతో ఉస్సురంటూ చిత్తూరు ఆస్పత్రికి వెళ్లి సంప్రదించారు. తాము రెఫర్ చేశాం కాబట్టి తమకు సంబంధం లేదని రుయాకు వెళ్లమనడంతో హతాశులయ్యారు. చివరకు రుయాకెళితే అసలు ఆస్పత్రిలో తాము వైద్యం చేయకముందే మృతి చెందాడు కాబట్టి.. ఇది బ్రాడ్ డెత్ అని, తాము డెత్ సర్టిఫికెట్ ఇవ్వలేమని తేల్చి చెప్పారు. మార్గమధ్యంలో రాజారెడ్డి ఎక్కడ చనిపోయాడో ఆ దేవునికే తెలియాలి. దీనిపై మృతుని కుటుంబీకులు పలమనేరు మున్సిపాలిటీకి వెళితే ఎఫ్ఐఆర్‌లో రుయా అని ఉండడంతో అక్కడికే వెళ్లమని చెప్పడంతో వారికి దిక్కు తోచలేదు. మళ్లీ మరోసారి చిత్తూరు ఆస్పత్రి, రుయా, తిరుపతి సచివాలయం..ఇలా అన్నింటికీ చక్కర్లు కొట్టడానికే సరిపోయింది. చివరకు రుయాలోని ముఖ్య అధికారులను కలిసి తమ గోడు వెళ్లగక్కితే.. బ్రాడ్‌డెత్‌కేసుల్లో ఎక్కడ అంత్యక్రియలు నిర్వహిస్తారో ఆ ఊరిలోనే డెత్ సర్టిఫికెట్ తీసుకోవాలని చెప్పి వారిని పంపేశారు.


వేలల్లో ఖర్చు..శ్రమ

అసలే రాజారెడ్డి కుటుంబం నిరుపేద కుటుంబం. మృతుడికి ఇద్దరు పిల్లలు. భర్త మృతి చెందినట్టు సర్టిఫికెట్ ఇస్తే కనీసం వితంతు పింఛనైనా వస్తే పిల్లల పోషణకు ఆదరవు ఉంటుందని మృతుని భార్య వేల రూపాయలు ఖర్చు చేసి, వారాల తరబడీ శ్రమలకోర్చి ఆయా కార్యాలయాలకు ప్రదక్షిణలు చేసింది. కేవలం డెత్ సర్టిఫికెట్ కోసం ఆమె పడిన పాట్లు చూస్తే ఇదే పరిస్థితిలో మరెందరో ఇబ్బందులు పడుతున్నట్లు స్పష్టమవుతోంది.



6. Registration of Brought Dead/Medico Legal Cases:
a. Brought dead cases can be registered at their usual residence, if a patient was died while transporting to the nearest town from their village for better treatment and Medical practitioner declared as brought dead. Collect Form-No.2from the nearest relatives, residential proof of diseased and burial ground certificate (on white paper) issued by the village secretary or manicipal authorities.
b. The medico legal cases can be registered according to the place of death mentioned in form No-2 issued by the Station House Officer (Police department) and collect the FIR copy and Postmortem report (only to ascertain cause of death).


బ్రాడ్‌డెత్ కేసుల్లోనే ఈ కష్టాలన్నీ..!



సాధారణంగా సహజ మరణం, రోడ్డు ప్రమాదం, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందితే మరణ ధ్రువీకరణ పత్రం ఇచ్చేస్తారు. అయితే మార్గమధ్యంలో మరణిస్తే మాత్రం దీన్ని పొందడం ఆషామాషీ కాదు. డెత్ సర్టిఫికెట్ లేకపోతే రేషన్ కార్డు, మృతుని బ్యాంకు ఖాతా, భూములు.. ఇలా దేనికైనా వారసులు లేదా భార్యకు ఖచ్చితంగా కావాల్సిందే. ఏ ప్రభుత్వ పథకాలు, పనులకెళ్లినా డెత్ సర్టిఫికెట్ తప్పనిసరి. ఈ సమస్యపై రుయా ఆస్పత్రి ఆర్ఎంవో హరికృష్ణను వివరణ కోరగా.. బర్త్ అండ్ డెత్ రిజిస్ట్రేషన్స్ చట్టం–1969 మేరకు బ్రాడ్ డెత్ కేసులో మృతునికి అంత్యక్రియలు చేసిన చోట బరియల్ గ్రౌండ్, క్రిమేషన్ సర్టిఫికెట్‌ను పొంది ఆయా సచివాలయాల్లో పొందాలని నిబంధన ఉందని తెలిపారు. దీనిపై అధికారులకు సైతం అవగాహన లేక సమస్యలు తప్పడం లేదని స్పష్టం చేశారు.



స్విమ్స్ ఇచ్చిన పోస్టుమార్టం నివేదిక



బ్రాడ్ డెత్‌గా సర్టిఫై చేసిన రుయా వైద్యులు



ప్రభుత్వం మంజూరు చేసే డెత్ సర్టిఫికెట్ ఇదే

గత ప్రభుత్వ నిధులకు మోక్షం

- మున్సిపాలిటీలో మొదలైన రూ.67లక్షల ఎంపీ లాడ్స్ పనులు
- 20వ వార్డులో సీసీ రోడ్డు పనులు
- నిధులు మరలిపోకుండా మున్సిపల్ కౌన్సిల్ యత్నం సఫలం



20వ వార్డులో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న అధికారులు, కౌన్సిలర్ మురళీకృష్ణ

పలమనేరు: గత ప్రభుత్వంలో చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప మంజూరు చేసిన ఎంపీ ల్యాడ్స్ పనులు పలమనేరు మున్సిపాలిటీలో ఎట్టకేలకు మొదలయ్యాయి. పట్టణంలోని 20వ వార్డులో సీసీ రోడ్లు, డ్రైన్లను మున్సిపల్ అధికారులు ఆ వార్డు కౌన్సిలర్ మురళీకృష్ణ సోమవారం ప్రారంభించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర వినతి మేరకు మాజీ ఎంపీ రెడ్డెప్ప మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకోసం రూ.67లక్షలను మంజూరు చేయడం విదితమే. ఇందులో భాగంగా పట్టణంలోని 20, 21వ వార్డులో సీసీ రోడ్లు, డ్రైన్లు, స్థానిక కోర్టు, ఆర్అండ్‌బీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్టీసీ డిపో వద్ద బస్సుషెల్టర్లు, మున్సిపాలిటీలో నాలుగు చోట్ల వాటర్ ప్లాంట్ల నిర్మాణాలకు ఈ నిధులను మంజూరు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులను ఆ పార్టీకి చెందిన కాంట్రాక్టర్లే చేయాలనే ఉద్దేశంతో ఉద్దేశపూర్వకంగా పెండింగ్‌లో పెట్టారు. దీనిపై దృష్టి సారించిన పలువురు కౌన్సిలర్లు ఎంపీ ల్యాడ్స్ విషయంలో ఆలస్యమైతే నిధులు మరలిపోతాయని గత మున్సిపల్ సమావేశాల్లో దీనిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి సైతం చొరవ చూపారు. ఎవరైనా సరే మున్సిపల్ అభివృద్ధికి పాటుపడాలని చర్చించారు. ఈ పరిణామాల క్రమంలో సోమవారం పనులు మొదలయ్యాయి. మిగిలిన పనులను త్వరలో చేపట్టనున్నట్టు స్థానిక మున్సిపల్ అధికారులు తెలిపారు.

సామాజిక పింఛన్లు అంగన్‌వాడీలకూ ఇవ్వాలి

పలమనేరు: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సామాజిక పింఛన్లను ఇకపై అంగన్‌వాడీ వర్కర్లు, మినీ అంగన్‌వాడీ, హెల్పర్లకు సైతం ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సరస్వతి డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం స్థానిక అసోసియేషన్ నేతలతో కలసి ఆమె విలేకరులతో మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న వర్కర్లను ప్రభుత్వం ఈ విధంగానైనా ఆదుకోవాలన్నారు. వీరికి ఆదాయ నిబంధనలను తొలగించి పింఛన్లు ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ నాయకురాళ్లు చిలకమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు





తులసమ్మ గుడి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు, హరిదాసు వేషధారణలో విద్యార్థి

పెద్దపంజాణి: మండలంలోని తులసమ్మ గుడి ఎంపీయూపీ పాఠశాలలో హెచ్ఎం హరిప్రసాద్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు సంక్రాంతి పండుగ, సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు హరిదాసు, సంప్రదాయ వేషధారణలతో అలరించారు. రంగవల్లులను అందంగా తీర్చిదిద్ది, గొబ్బెమ్మలను పెట్టి, పాటలు పాడారు. చివరగా పాఠశాల ముందు భాగంలో భోగి మంటలు వేసి చీడపీడలు, చెడు భావనలు భోగి మంటల్లో కాలిపోయి నూతన ఒరవడి సృష్టించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేంద్ర, రషీద్ అహ్మద్, పీఎంసీ చైర్మన్ మాధవి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ



విశ్రాంత ఉద్యోగుల డైరీలను ఆవిష్కరిస్తున్న చేస్తున్న గురురాజారావు, సభ్యులు

పుంగనూరు: విశ్రాంత ఉద్యోగుల డైరీని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గురురాజారావు ఆవిష్కరించారు. సోమవారం అసోసియేషన్ అధ్యక్షుడు చెంగారెడ్డి అధ్యక్షతన విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించిన సమావేశంలో డైరీలను ఆవిష్కరించారు. గురురాజారావు మాట్లాడుతూ, విశ్రాంత ఉద్యోగులకు 15 శాతం అదనపు పెన్షన్ ఇవ్వాలని, ఈహెచ్ఎస్ కార్డులతో సమానమైన వైద్యసేవలు , 11వ పీఆర్‌సీని సవరించి 12వ పీఆర్‌సీని వేయాలని, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు రామకృష్ణారెడ్డి, మునస్వామి మొదలియార్, నారాయణ, ఎర్రయ్య, రెడ్డెప్పరెడ్డి యాదవ్, సిద్దలింగం, సాగర్‌రెడ్డి, భరత్ భూషణ్, మహబూబ్‌బాషా, చంద్ర కళావతి, గంగులమ్మ, ద్వారకమ్మ, పారిజాతం, రెడ్డికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఓటేరుపాళ్యంలో వైద్య శిబిరం

సాక్షి ఎఫెక్ట్..

బైరెడ్డిపల్లె: మండలంలోని ఓటేరుపాళ్యంలో బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షించారు. ప్రజలు ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. 'ఓటేరుపాళ్యంలో పారిశుధ్య లోపం' అనే శీర్షికతో సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనంపై ఆయన స్పందించి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే పాటించాలని గ్రామస్తులను కోరారు. ఇంటింటా సర్వే చేసి జ్వర బాధితులను గుర్తించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, సీహెచ్ఓ అనూరాధ, సూపర్‌వైజర్ గోపి, ఆరోగ్య సిబ్బంది పుష్పలత, లీలావతి పాల్గొన్నారు.



ఓటేరుపాళ్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి విజయ్‌చంద్ర

కుప్పంలో మరో రైలు స్టాపింగ్

కుప్పం రూరల్: ప్రస్తుతం కుప్పం మీదుగా రాకపోకలు సాగిస్తున్న రైళ్లలో ఒక ట్రైన్‌కు ప్రతి మంగళవారం కుప్పంలో స్టాపింగ్ కల్పించారని రైల్వే అధికారులు తెలిపారు. బెంగళూరు నుంచి రేణిగుంట మీదుగా లక్నో వెళ్లే రైలు ప్రతి మంగళవారం ఉదయం 8.40 గంటలకు కుప్పంలో ఆగనుంది. మరలా బుధవారం మధ్యాహ్నం అదే రైలు 12.30 గంటలకు కుప్పంలో ఆగనున్నట్లు అధికారులు తెలిపారు. కుప్పం నుంచి రేణిగుంట, బెంగళూరులకు వెళ్లే ప్రయాణికులకు ఇది సౌకర్యంగా ఉంటుందని అధికారులు చెప్పారు.

తాగునీటి ఎద్దడికి ముందస్తు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ యువరాజు ఆదేశించారు. సోమవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండల గ్రాంట్ నిధులు ఉన్నాయని అవసరమైతే సంబంధిత అధికారులతో చర్చించి గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా నూతన బోర్లు వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నీటి మట్టం పడిపోయిన చోట బోర్లు వేసి, పైపులైన్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్, సర్పంచ్ సుభాష్, ప్రజాప్రతినిధులూ పాల్గొన్నారు.

10న కాణిపాకంలో వైకుంఠ ఏకాదశి

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అనుబంధంగా ఉన్న శ్రీ వరదరాజులస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని ఈ నెల 10వతేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. పట్టువస్త్ర సమర్పణ, వేకువజామున అభిషేకం, ప్రత్యేక అలంకరణ, ఉదయం 10 గంటలకు గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

స్కానింగ్‌తో చెల్లింపులు

చిత్తూరు కార్పొరేషన్: ఈ నెల నుంచి ఇస్తున్న విద్యుత్ బిల్లులను స్కానింగ్ విధానంతో జారీచేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. బిల్లు కింద భాగంలో క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు. వాటిని యూపీఐ యాప్స్‌లో స్కాన్ చేయాలన్నారు. బిల్లు మొత్తం చూపినప్పుడు చెల్లింపులు చేయాలన్నారు. గత ఆరునెలలుగా యూపీఐ ద్వారా డైరెక్ట్‌గా బిల్లులను కట్టే విధానం ఆర్‌బీఐ నిబంధనల మేరకు ఆపివేశారన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ సైట్ లేదా లింక్ లేదా విద్యుత్ వసూలు కేంద్రాల్లో బిల్లులు కట్టేవారని చెప్పారు. ప్రస్తుతం క్యూఆర్ కోడ్ విధానంతో క్యూలో నిలబడే పనిలేకుండా ఉన్నచోట నుంచి బిల్లు కట్టవచ్చన్నారు. ఆన్‌లైన్ చెల్లింపులకు సహకరించాలన్నారు. అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

సెమిస్టర్‌లో మదర్‌థెరిసా విద్యార్థుల ప్రతిభ



చందన పూజిత హంసిక దేవిశ్రీ

గంగవరం: ఎస్వీ యూనివర్సిటీ విడుదల చేసిన 2వ సెమిస్టర్ ఫలితాల్లో మండలంలోని మదర్‌థెరిసా కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి ఉత్తమ ఫలితాలు సాధించినట్టు కరస్పాండెంట్ రవీంద్రబాబు సోమవారం తెలిపారు. బీసీఏలో చందన(9.48), పూజిత(9.4), హంసిక(9.21), దివ్యశ్రీ(9.13), మోషిత(9.19), ఉషారాణి(9.03), బీబీఏలో దేవిశ్రీ(9.39), డింపుల్(9.19), సంతోష్‌కుమార్(9.04), బీకాంలో నాగవేణి(8.9), ఉష(8.86), తనుజ(8.75), బీఎస్సీలో షేక్ ఆఫిషా(8.71), గౌతమి(8.56) జీఎస్‌జీపీఏ సాధించి కళాశాల స్థాయిలో టాపర్స్‌గా నిలిచారన్నారు. బీఎస్సీ, బీసీఏ, బీకాం, బీబీఏ మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్‌లో 270 డిస్టింక్షన్లు, 140 ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులను కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ మధుసూధన్‌రావు అభినందించారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో..



డిగ్రీ ఫస్టియర్ సెకండ్ సెమిస్టర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థినులు

పలమనేరు: డిగ్రీ ప్రథమ సంవత్సర 2వ సెమిస్టర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని స్థానిక శ్రీవాణి, పద్మావతి కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి రెడ్డి సోమవారం తెలిపారు. బీసీఏలో హేమావతి86 శాతం, బీఎస్సీ కంప్యూటర్స్ సైన్సులో లోహిత86 శాతం, బీకాం కంప్యూటర్స్‌లో నాగమణి 93 శాతం, బీవొకేషనల్ హార్టికల్చర్‌లో స్టెఫీ 94 శాతం మార్కులను సాధించారని తెలిపారు. తమ రెండు కళాశాలల్లో 65 మంది డిస్టింక్షన్లు, 54 మంది ప్రథమ శ్రేణిలో పాసైనట్టు పేర్కొన్నారు.విద్యార్థులను కళాశాల యాజమాన్యం సీపీ శ్రీవాణి, అధ్యాపకులు అభినందించారు.

ఎంవీఆర్ కళాశాల విద్యార్థులు..



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గంగవరం: ఎస్వీ యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ 2వ సెమిస్టర్ ఫలితాల్లో మండలంలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని కళాశాల కరస్పాండెంట్ ఎంవీఆర్ రెడ్డి సోమవారం తెలిపారు. బీకాంలో పూజిత 9.15, అమృషా 9.15, నజీరా9.10, బీసీఏలో హిమబిందు9.16, లయ9.00, బీబీఏలో హారతి9.16, హరిక్రిష్ణ–9.00, బీఎస్సీలో శైలజ9.00, మేనక9.00 జీపీఏలు సాధించినట్టు చెప్పారు. వారిని ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ, అధ్యాపకులు అభినందించారు.